# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట


## ఆర్జీలను సత్వరమే

# పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
- ప్రజావాణికి 125 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 24, ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లాకలెక్టర్ విజయేందిర బోయిఅధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 125 దరఖాస్తులను స్వీకరించారు. అట్టి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదే శించారు. ప్రజావాణిలో రెవెన్యూ,ల్యాండ్ సర్వే, ఇతర శాఖలకు సంబంధించిదరఖాస్తులు అందాయని పేర్కొన్నారు అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తాగునీరు,విద్యుత్ సరఫరా ఇబ్బంది లేకుండా మండల ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలన్నారు.రెండు రోజులుగా జిల్లాలో వర్షాలు,వడగళ్ళకారణంగా మహబూబ్‌నగర్‌రూరల్,హన్వాడ, మూ సాపేట,భూత్పూర్ మండలంలో పంట నష్టం సంబంధించి ప్రాథ మిక నివేదిక అందించినట్లు తెలిపారు.మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లగ్రౌండింగ్ త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణఉపాధి కార్యక్రమం పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో స్థానికసంస్థల అదనపుకలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు,అర్.డి. ఓ నవీన్,జడ్.పి.సి. ఈ. ఓ వెంకట రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కొనసాగించాల్సిందే..



సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

- కార్మికుల ఆచూకీ గుర్తించాలి
- కేంద్రం నుంచి అన్నీ అనుమతులు తీసుకోండి
- సహాయక చర్యల్లో 25ఏజెన్సీలు
- ప్రత్యేకాధికారిగా శివశంకర్ ఐఏఎస్ నియామకం
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- హాజరైన మంత్రులు ఉత్తమ్,పొంగులేటి,జూపల్లి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 24, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బీసీ ప్రమాదం లో చిక్కుకున్న కార్మికులను బయట కు తెచ్చేందుకు అవసరమైన సహాయ క చర్యలను కొనసాగించాలని ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సహాయక చర్యలను నిరంతరం దగ్గరుండి పర్యవేక్షించేం దుకు ఐఏఎస్ అధికారి శివశంకర్ లోతేటిని ప్రత్యేకాధికారిగా నియమిం చాలని సీఎస్‌ను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఎస్ఎల్బీసీ సొరం గంలో జరిగిన ప్రమాదానికి సంబం ధించిన కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతా ధికారులు ఈ సమావేశంలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా నెల రోజు లుగా ప్రమాద స్థలిలో కొనసాగు తున్న సహాయక చర్యల పురోగతిని విపత్తు నిర్వహణ విభాగం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, కల్నల్ పరీక్షి త్ మెహ్రా ముఖ్యమంత్రికి వివరించారు. కేంద్ర రాష్ట్రాలకు చెందిన వివిధ విభాగాల తో పాటు ప్రైవేటు సంస్థలన్నీ కలిపి 25ఏజెన్సీలు సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయని చెప్పారు. మొత్తం 700మంది సిబ్బంది ఈ ఆపరేషన్ లో నిమగ్నమైనట్లు చెప్పారు. సొరంగంలో కూలిన రాళ్లు, టీబీఎం విడిభాగాలను వెల్డింగ్ చేసి బయటకు తీస్తున్నామని, ఎప్పటికప్పుడు అక్కడ పేరుకున్న మట్టి, రాళ్ల దిబ్బలు, పూడిక, ఊట నీటిని బయటకు తొలిగిస్తున్నామని చెప్పారు. రెస్క్యూ ఆపరేషన్ కళ్లకు కట్టించేలా ప్రమాదం జరిగిన రోజున, ఇప్పుడున్న పరిస్థితుల ఫొటోలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రదర్శించారు. ఇన్లెట్ వైపు నుంచి సొరంగంలో 14 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం జరిగినందున గాలి, వెలుతురు తక్కువగా ఉండటంతో సహాయక చర్యలు చేపట్టడం సంక్లిష్టంగా సాగుతోందని అధికారులు వివరించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో 30మీటర్లు అత్యంత ప్రమాదకర జోన్ గా గుర్తించినట్లు చెప్పారు. జీఎస్ఐ, ఎన్జీఆర్ఐ శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం అక్కడ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాల్సి ఉంటుందనే అభిప్రాయం వెలిబుచ్చారు. ప్రమాదానికి గురైన కార్మికుల ఆచూకీ కనుక్కొనేందుకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ ఆపద సమయంలో చేపట్టాల్సి న అత్యవసర పనులకు కేంద్రం నుంచి అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి 22వ తేదీన ఎస్ఎల్బీసీ సొరంగ ప్రమాదం జరుగగా, ఎనిమిది మంది కార్మికులు ఈ ప్రమాదంలో చిక్కుకోగా వీరిలో గుర్ ప్రీత్ సింగ్ మృతదేహం మార్చి 9న లభ్యమైన సంగతి తెలిసిందే.



సమీక్షలో పాల్గొన్న అధికారులు

## పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**నారాయణపేటటౌన్,మార్చి 24 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గల పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్షా సరళిని ఆమె పరిశీలించారు. కేంద్రంలో విద్యార్థుల హాజరు శాతం గురించి సీఎస్‌ను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని ఓ గదిలో బియ్యం బస్తాలు నిల్వ చేసిన స్థలంలోనే పెయింటింగ్ (కలర్) డబ్బాలు ఉడటం గమనించిన కలెక్టర్ వెంటనే వాటిని అక్కడి నుంచి తీసి వేయాలని ఆదేశించారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

## పురుడోసుకున్న నీరుగట్టు

**జడ్చర్ల,మార్చి 24, ప్రభాతవార్త:**నాలుగు రోజుల క్రితం మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం పరిధిలోని నసురుల్లబాద్‌లో ఓ ఇంట్లోకి నీరుగట్టు పాము రాగా సర్పరక్షకుడు డా.సదాశివయ్యకు తెలియజేశారు. వెంటనే వారి శిష్యులు పామును రక్షించగా అక్కడే ఆ పాము పెట్టిన గుడ్లను గుర్తించారు. వాటిని స్థానిక డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఉన్న బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో నిలువ చేయగా గుడ్డును చీల్చుకుని పిల్ల పాములు బయటకు వచ్చాయి. 21 గుడ్లు ఉండగా అందులో నుండి 10 పిల్ల పాములు బయటకు వచ్చినట్టుగా గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య తెలిపారు. గత 5 సంవత్సరాల నుండి ఇలా దొరికే గుడ్లను హైదరాబాద్ లోని ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీకి పంపేవారమని తద్వారా కొన్ని గుడ్లు పాడయ్యేవని తెలిపారు. వాటిని పొదిగిం చడానికి అవసరమయ్యే పరికరాలు కళాశాలలో లేకపోవడం వల్ల అక్కడికి పంపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలెవరైనా హచింగ్ పరికరాలను అందిస్తే ఇక్కడే వాటిని పిల్లలుగా మార్చి సర్పజాతిని సంరక్షించవచ్చన్నారు. ఈ పిల్లలను అటవీ ప్రాంతంలో వదిలివేయనున్నట్టు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సుకన్య వాటిని చూసి ఆనందం వ్యక్తం చేశారు.



గుడ్డు నుంచి పాము పిల్లలు బయటకు వచ్చిన దృశ్యం

# ప్రజావాణికి 38 ఫిర్యాదులు

- ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ బి.యం.సంతోష్



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, మార్చి 24 ప్రభాతవార్త :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు లతో కలిసి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి మొత్తం 38 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారాలకు తెరలేపిన

# ప్రైవేటు పాఠశాలలు



ప్రచారంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు

- అడ్మిషన్ల టార్గెట్లతో ప్రైవేట్ స్కూళ్లల్లో అరాచకం
- ప్రైవేటు టీచర్లను ఎండల్లో తిప్పుతున్న యాజమాన్యాలు
- ధనార్జనే ధ్యేయంగా పాఠశాలల పనితీరు
- అధికారులు స్పందించాలని ప్రజల గగ్గోలు

**వనపర్తి క్రైమ్, మార్చి 24 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్ల కోసం ప్రచారాలు ఊపందుకున్నాయి. సరైన విద్యా బోధన అందితే విద్యార్థుల చేరికలు వాటంతటవే పెరుగుతాయని మరిచిన కార్పొరేట్ స్థాయి అని చెప్పుకునే కొన్ని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్నాయి. అధికారులు చూసి చూడనట్టు ఉండటంతో ప్రైవేట్ పాఠశాలల ఆగడాలకు హద్దు లేకుండా పోతుంది. పాఠశాలల భవనాలు పూర్తికాకముందే అనుమతులు లేకుండా ప్రచారాలు ప్రారంభించారు. 2024, 2025 సంవత్సరం చదువులు పూర్తికాకముందే – మిగతా2లో..

## పచ్చని అడవులు

# బట్టీల పాలేనా..



- ఇటుక బట్టీలలో, కంపెనీలలో కాలుతున్న కలప
- అధికారుల అలసత్వం,దళారులకు వరం
- కాసులు కురిపిస్తున్న కలప దందా
- ఇంత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులకు తెలియదా ?

**నవాబుపేట, మార్చి 24 ప్రభాతవార్త :** పచ్చదనంతో ప్రజలకు జీవ వాయువుల ఉపయోగపడే కలప చెట్లను అక్రమార్కులు దౌర్జన్యంగా అక్రమంగా నరికి సొమ్ము చేసుకుంటున్నారు. అడవుల రక్షణకు ప్రభుత్వాలు పనిచేస్తుంటే అక్రమార్కులు మాత్రం ధనార్జనే ధ్యేయంగా కలప తరలిస్తున్నారు. అధికారుల కంట పడకుండా ఈ చీకటి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని చేపడుతుంటే మరోవైపు అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరుకుతూ కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదం అధికారుల అలసత్వంతో కాగితాలకే పరిమితమైంది. అటవిని రక్షించడంతో పాటు వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వాల్టా చట్టం రూపొందించింది. చెట్లను నరికి వేయాలంటే అటవీశాఖ, రెవెన్యూ శాఖ సంబంధిత గ్రామ పంచాయతీ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. అధికారుల అలసత్వం, దళారులకు వరంగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని నవాబుపేట, రాజాపూర్, కొల్లూరు, కొందుర్, కొల్లూరు శివారు నుండి ఇటు మహబూబ్‌నగర్ పట్టణానికి ప్రసిద్ధిగాంచిన అడవి పర్వతాపూర్ మైసమ్మ అడవి పచ్చదనంతో ఉండే అడవి కొంత దూరం లోపలికి వెళ్ళాక ఎడారిగా మారింది అనే సూచనలు కనిపిస్తున్నాయి. అర్బన్ ఏరియాలలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. అక్రమార్కులు వాల్టా చట్టానికి తూట్లు పొడిచి రోడ్ల వెంబడి, గుట్టలలో ఏపుగా పెరిగిన చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా చెట్లను నరికి ఏ మాత్రం భయం లేకుండా ట్రాక్టర్లు, బొలెరో వాహనాలు, లారీల్లో తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడిచి కలపను తరలిస్తున్నారంటే అధికారులు ఏ మేరకు వ్యాపారులతో లాలూచి పడ్డారో అర్థం చేసుకోవచ్చునని అన్నారు.

**కాసులు కురిపిస్తున్న కలప దందా....**

వేప, తుమ్మ చెట్లను సైతం అక్రమార్కులు వదలడం లేదు. పంట చేలు, గుట్టల ప్రాంతాలోని చెట్లు, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన వృక్షాలు నేల కూలుస్తున్నారు. కలప వ్యాపారులు తక్కువ ధరకు చెట్లను కొనుగోలు చేస్తున్నారు. వాటిని నరికి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ క్వింటాళ్ల చొప్పున అమ్ముకుంటున్నారు. చెట్ల నరికివేత పై అధికారుల నియంత్రణ లేకపోవడంతో విచ్చలవిడిగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కలపను అధిక ధరలకు విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.అధికారుల అలసత్వం, దళారులకు వరంగా మారింది. నవాబుపేట మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ అటవీ ప్రాంతం కొన్ని వేల ఎకరాలలో పాకి ఉంది. మహబూబ్‌నగర్ టు అప్పన్నపల్లి నుండి మొదలుకొని దట్టమైన అటవీ ప్రాంతం కులక్‌చర్ల, పరిగి వరకు విస్తరించి ఉన్న అడవుల నుండి కలప అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది.

**అధిక సంఖ్యలో ఇటుక బట్టీలలో కాలుతున్న కలప....**

టన్నుల కొద్దీ కలప ఇటుక బట్టీలకు తరలుతోంది. అక్రమార్కులు వాల్టా చట్టానికి తూట్లు పొడిచి రోడ్ల వెంబడి, గుట్టలలో ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**ఇంత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులకు తెలియదా ?**

కలప అక్రమ రవాణాపై అటవీశాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, కలప వ్యాపారులు చేతులు కలపడంతో వారి సంపాదన మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వర్ధిల్లుతోందనే ప్రచారం జరుగుతోంది. ఉన్నతాధికారులకు అనుమానం రాకుండా.. అప్పుడప్పుడూ తూతూ మంత్రంగా దాడులు చేసి, కేసులు నమోదు చేస్తూ.. పెద్ద ఎత్తున కలపను పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటుక బట్టీల ముసుగులో కలప రవాణా సాగుతుంది. ఇంత జరుగుతున్నా అక్రమ కలప రవాణాను అరికట్టేందుకు అటవీశాఖ అధికారులు తీసుకున్న చర్యలు మాత్రం శూన్యంగా కనిపిస్తున్నాయి. ఈ విషయంలో అధికారులు మేలుకోకుంటే భవిష్యత్తులో ఎన్ని మొక్కలు నాటినా నిష్ప్రయోజనమేనని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కలప అక్రమ నరికివేత, రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కంపెనీలకు తరలించిన కట్టెలు (ఫైల్)

# క్షయ నియంత్రణలో మొదటిస్థానం

- 2087 మంది రోగులను గుర్తించి 1218 చికిత్స
- అభినందించిన కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 24,ప్రభాత వార్త:** జిల్లాలో క్షయ వ్యాధి నియంత్రణ, రోగులకు చికిత్స అందించడం లో అన్ని సూచికల్లో జిల్లా మొదటి స్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో ప్రపంచం క్షయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో టి.బి రోగులకు అందించిన సేవలకు గాను రాష్ట్ర టి.బి. నియంత్రణ విభాగం నుండి జిల్లాకు మొదటి స్థానంలో నిలిచినందుకు కలెక్టర్ జిల్లా టి.బి.నియంత్రణ అధికారి,వైస్యిబ్బందికి అభినందనలు తెలిపారు. జిల్లాలో గత సంవత్సరం జనవరి నుంచి డిసెంబర్ వరకు 2087 మంది టి.బి.లక్షణాలు ఉన్న రోగులను గుర్తించి 1218 రోగులకు చికిత్స అందించి టి.బి వ్యాధి నయం చేసినట్లు తెలిపారు. అదే విధంగా 1767 మంది వ్యాధి లక్షణాలున్న రోగులకు వెయ్యి రూపాయలు చొప్పున ఆరు నెలల పాటు వారి అకౌంట్లో జమచేయడం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. టి.బి.నియంత్రణకు 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో బాగంగా జిల్లాలో 2024 డిసెంబర్ 7 నుంచి మార్చి 24 వరకు రెండు మొబైల్ వ్యాన్ ల ద్వారా టి.బి లక్షణాలు ఉన్న.రోగులకు గ్రామ పంచాయతీ, సబ్ సెంటర్ స్థాయిలో తెమడ పరీక్షలు నిర్వహించి వారికి చికిత్స అందించినట్లు తెలిపారు.అరెజన్ ఫార్మాసిటికల్ కంపెనీ లిమిటెడ్ సి ఎస్ ఆర్ కింద 1650 మంది టీబీ రోగులకు పోషకాహార బాస్కెట్ లను టి.బి.రోజులకు నెలనెలా అందించడం జరుగుతున్నట్లు తెలిపారు.టి.బి పరీక్షలు నిర్వహించేందుకు డి.ఎఫ్ ఎం.టి నిధుల ద్వారా పోర్టబుల్ ఎక్స్ రే కు జిల్లా కలెక్టర్ 20 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది జిల్లాలో టి.బి లక్షణాలు కనిపించిన రోగులు సమీప పి.హెచ్.సి,సబ్ సెంటర్ లో సంప్రదించి చికిత్సీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా టి.బి.నియంత్రణ కు పాటు పడతానని అందరిచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ ఆదనపు కలెక్టర్ మోహన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె కృష్ణ జిల్లా టి.బినియంత్రణ అధికారి డాక్టర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.తొలుత ప్రపంచ టి.బి.దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లోని టి.బి.కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించి టి.బి.నియంత్రణ పై మాట్లాడారు. టి.బి.జయించిన వారికి ఫుడ్ బాస్కెట్ లు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా కె.కృష్ణ,జిల్లా టి.బి.నియంత్రణ అధికారి డా.మల్లికార్జున్, ఐ.ఎం. ఏ అధ్యక్షులు డా రామ్మోహన్,ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్ కుమార్,డా.శశికాంత్,జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం,పల్మ నాలజినిస్ట్ డా.శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు .



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి, అధికారులు

## ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తిటౌన్,మార్చి24 ప్రభాతవార్త:**ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యంచేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లాకలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనప కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్యతో కలిసి ప్రజల నుంచి అదనపు కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 47 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. టీ ప్రైడ్ స్కీం కింద ఇన్సెంటివ్స్ మంజూరు పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రీస్ విభాగం జనరల్ మేనేజర్ జ్యోతి ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ టీజీ ఐపాస్‌కు సంబంధించి ఆన్లైన్లో అప్లికేషన్లు ఏమైనా పెండింగ్లో ఉంటే పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. డిఐపిసిలో భాగంగా టీ ప్రైడ్ స్కీమ్ కింద ఎస్సీ 6, ఎస్టీ 6, పిహెచ్సి 1లకు సంబంధించిన ఇన్సెంటివ్స్‌ని కలెక్టర్ మంజూరు చేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అదుపు తప్పితే అధోగతి

**మామిళ్ళపల్లి, ఉప్పరపల్లి మార్గంలో పొంచి ఉన్న ప్రమాదం**

**ఉప్పునుంతల,మార్చి 24 ప్రభాతవార్త :** ఉప్పరిపల్లి నుంచి మామిళ్ల పల్లి వరకు బిటి రోడ్డు వేశారు. ఈ మార్గం గుండా సిఆర్ఆర్ నిధుల కింద రూ.2 కోట్ల 70 లక్షల వ్యయంతో బిటి రోడ్డు, కల్వర్టు నిర్మాణం చేపట్టారు. కల్వర్టు నిర్మాణ ప్రాంతం నుంచి మామిళ్లపల్లికి వెళ్లే మార్గంలో మూలమలుపు వద్ద రోడ్డు వర్షం తాకిడి దెబ్బ తింది. పనులు చేపట్టి సంవత్సరన్నర కాలం పూర్తి కాక ముందే రోడ్డు మార్గం గుండా ప్రమాదాలు దాపురించే విధంగా ఉన్నాయి. రోడ్డు వేశారు



మామిళ్ళపల్లి, ఉప్పరిపల్లి మార్గంలో దెబ్బతిన్న బిటి రోడ్డు

నిర్వహణ మర్చిపోవడంతో రోడ్డు మార్గం గుండా రాత్రి వేళల్లో అదుపుతప్పితే ప్రాణాలు పోయినట్లే. ప్రమాద భరితంగా కనిపిస్తున్నప్పటికీ నాయకులు గానీ, సంబంధిత శాఖ అధికారులకు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉంది. ఈ మార్గం గుండా వెళ్లే వాహన చోదకులు అజాగ్రత్తగా ఉంటే అధోగతి ఏర్పడే ప్రమాదం ఉంది. మామిళ్ళపల్లి, దాసర్లపల్లి, కల్వకుర్తి నియోజకవర్గం రఘుపతి పేట, రామగిరి ప్రాంతాల వాసులు ఈ మార్గం గుండా అచ్చంపేటకు వెళ్తుంటారు. తిరిగి స్వగ్రామాలకు క్షేమంగా వెళ్లాలని తాపత్రయంతో వెళ్తుంటారు, కానీ ఏమాత్రం నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు తీవ్రంగా ఉంటాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టి మామిళ్ళపల్లి ఉప్పరిపల్లి మార్గంలో దెబ్బతిన్న రోడ్డును వెంటనే బాగు చేయాలని, లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పంచాయతీరాజ్ అధికారులు రోడ్డు మార్గాన ఒక్కసారి ప్రయాణిస్తే వారికి పూర్తిగా అర్థమవుతుందని, తాము ఎన్నిసార్లు విన్నవించుకున్న పెడచెవిన పెడుతున్నారని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వ పనులను చేపట్టిన తదుపరి పర్యవేక్షణ నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలి : గంట కవితాదేవి

**గద్వాల, మార్చి 24 ప్రభాతవార్త :** సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంటా కవితా దేవి ముఖ్యఅతిథిగా పాల్గొని, సభలో మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి దిశగా ఎదగాలని, ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ఆర్థిక స్వావలంబన కలిగి ఉండాలని, పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వం అందించే అవకాశాలను పథకాలను సద్వినియోపరుచుకొని జీవితంలో ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు సాధికారత సాధించాలని అన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆర్థికంగా బలపడాలని, వారి యొక్క చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ నర్సింగరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సంగీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంట కవితాదేవి

## మహిళా రైతులకు అందుబాటులో పరికరాలు

**ఉప్పునుంతల,మార్చి 24 ప్రభాతవార్త :** మండల పరిధిలో మహిళా రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. వేయి రూపాయల రాయితీతో బ్యాటరీ కం హ్యాండ్ స్ప్రేయర్లు 5 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇందులో 4 యూనిట్లను జనరల్ మహిళలకు కేటాయించగా, ఒక యూనిట్ మాత్రం ఎస్టి మహిళకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా పవర్ స్ప్రేయర్లు 5 యూనిట్లు అందుబాటులో ఉండగా 4 యూనిట్లు జనరల్ మహిళలకు ,ఒక యూనిట్ ఎస్సీ మహిళకు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ స్ప్రేయర్లకు 9 వేల రూపాయల వరకు రాయితీ లభిస్తుందని ఆయన వివరించారు. 48 వేల రూపాయల రాయితీతో జనరల్ మహిళలకు కేటాయించిన రెండు రోటోవేటర్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఎస్టి మహిళకు కేటాయించిన సీడ్ కం ఫెర్టిలైజర్ ఒక యూనిట్ 30 వేల రూపాయల రాయితీతో అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. కావలసిన మహిళా రైతులు ఈ నెల 26 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి.రవీందర్**

**కోయిలకొండ, మార్చి 24 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు నడపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి. రవీందర్ ముదిరాజ్,బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు వై.విద్యాసాగర్ గౌడ్‌లు అన్నారు.సోమవారం మండల పరిధిలోని ఆచార్య పూర్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలు నక్క వెంకటేష్‌యాదవ్, దిలీప్‌కుమార్ శర్మలతో కలసి వారు సిసిరోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు.ఈసందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలైన నక్కవెంకటేష్,దిలీప్‌కుమార్ శర్మలు మాట్లాడుతూ ఆచార్య పూర్ గ్రామాన్ని నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి ఆశీస్సులతో అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తామన్నారు. గ్రామంలోని ప్రతివార్డులలో మట్టి రోడ్లు కనబడకుండా సిసి రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి నాయక్, పిట్ల శేఖర్, ఎం.రామస్వామి, నక్క హనుమంతు యాదవ్,నక్క గోపాల్‌యాదవ్,నక్క ప్రభాకర్ యాదవ్,నక్క వెంకటయ్య యాదవ్, నక్క నారాయణ యాదవ్, జాజల కురుమయ్య యాదవ్, వడ్డే ఆంజనేయులు, వడ్డే సాంబశివ, నక్క గోవింద్ యాదవ్, పోతనపల్లి గోవింద్ యాదవ్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభించిన డీఈవో ప్రవీణ్‌కుమార్

**మూసాపేట్,మార్చి 24 ప్రభాతవార్త :** మండలంలోని ఎంఎంపిఎస్ నిజాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఎఫ్ఎల్ఎన్ ఏఎక్సెల్ బోధనలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ ల్యాబ్‌ను ప్రారంభించి బోధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ హై స్కూల్ నిజాలాపూర్ విద్యార్థులకు డిఈఓ స్వయంగా ఇంగ్లీష్, తెలుగు, గణితమును కంప్యూటర్స్ ముందు కూర్చుని విద్యార్థులకు నేర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రత్యేక హోదా కల్పిస్తూ ఎఫ్ఎల్ఎన్, ఏఎల్ఎక్స్ బోధన గురించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినటువంటి ఈ వినూత్న కార్యక్రమం చాలా బాగుందని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మూసాపేట మండల విద్యాధికారి రాజేశ్వర్ రెడ్డి, ఎపిఎస్ చైర్మన్ రామేశ్వరమ్మ, ప్రాథమిక పాఠశాల నిజాలాపూర్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం బాలకృష్ణయ్య, జడ్పీహెచ్ఎస్ నిజాలాపూర్ ఇన్చార్జి హెచ్ఎం సరిత అదేవిధంగా ఇరు పాఠశాలల ఉపాధ్యాయులు, ఆర్‌పి రాఘవేందర్ విద్యార్థులు ఉన్నారు.



కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న డీఈఓ

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తికి జైలుశిక్ష

**ట్రాఫిక్ సీఐ భగవంత్ ఆధ్వర్యంలో తనిఖీలు**

**మహబూబ్‌నగర్, మార్చి24, ప్రభాతవార్త:** ఎస్పీ డి. జానకి ఆదేశాలమేరకు,మహబూబ్‌నగర్‌టౌన్‌లో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై విస్తృత తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంత్ రెడ్డి నేతృత్వంలో సోమవారం మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 8మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, 2వ తరగతి కోర్టులో హాజరు పర్చారు. ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆర్. శశిధర్ కేసును పరిశీలించి, నలుగురికి రూ.1000, ఇద్దరికి రూ.1500, ఒకరికి రూ.2000 చొప్పున నగదు జరిమానా విధించగా, మరొకరికి 3 రోజుల జైలు శిక్ష విధించి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంత్ రెడ్డి మాట్లాడుతూ, "డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల రోడ్లపై ప్రమాదాలు పెరుగుతున్నాయి. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, తమ భద్రతను ఇతరుల ప్రాణాలను రక్షించాలన్నారు. ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కఠినంగా కొనసాగుతాయని హెచ్చరించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

# వర్షాలు సంవృద్ధిగా కురిసినా.. తాగునీటికి కటకట!

**ఏదుల మండల కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించండి**

**ప్రత్యేక శాఖ ఉన్నా...అధికారుల పట్టింపేది?**

**మార్నింగ్ వాక్‌లో రాచాల యుగంధర్ గౌడ్**

**వనపర్తి క్రైమ్, మార్చి 24 ప్రభాతవార్త :** ఏదుల మండలంలో కనీస సౌకర్యాలు కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఏదుల మండల కేంద్రంలో నిర్వహించిన రాచాల మార్నింగ్ వాక్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం ఏదులకు చేరుకున్న రాచాలకు మాజీ సర్పంచ్ మశన్న ఆద్వర్యంలో బాణసంచా, డప్పు చప్పుళ్ళతో స్వాగతం పలికారు. వీరాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మండల కేంద్రంలో స్థానిక ప్రజలతో కలిసి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నడక కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో 164 మంది విద్యార్థులు ఉన్నారని, తరగతి గదులు మాత్రం రెండే ఉండటంతో శిధిలావస్థలో ఉన్న భవనాల్లోనే విద్యను అభ్యసిస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు త్వరితగతిన నూతన భవనాలను నిర్మించడంతో పాటు ఒక బోర్ వేయించి, విద్యార్థులకు



సమస్యలపై వినతి పత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్

తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు.మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించాలని కోరారు. స్థానికంగా గతంలో ఉన్న బస్సు షెల్టర్ రోడ్డు విస్తరణలో పోవడంతో ప్రస్తుతం ప్రయాణికులకు షెల్టర్ లేకుండా పోయిందని, కావున ప్రయాణికుల సౌకర్యార్థం ఒక బస్టాండ్ నిర్మించాలన్నారు. తమకు విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, ప్రస్తుతం చిన్నంబావి ఫీడర్ నుంచి విద్యుత్తు సరఫరా చేస్తుండటంతో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, అక్కడి నుంచి కాకుండా చెన్నారం లేదా వనపర్తి ఫీడరుకు కలపాలని, అదే విధంగా రాజాపూర్ మరియు మాచుపల్లి నుండి ఏదుల మండల కేంద్రానికి బిటి రోడ్డు సౌకర్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర సమస్యలపై మాజీ సర్పంచ్, తదితరులు రాచాలకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, మిషన్ భగీరథ నీరు వారానికోసారి కూడా రాకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు రాచాలతో మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన రాచాల ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురిసినా అధికారుల సరైన ప్రణాళిక లేని కారణంగా తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయని, తాగునీటి కోసం ప్రత్యేక శాఖ ఉన్న కూడా అధికారుల పట్టింపేది అని మండిపడ్డారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే మరియు అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎర్రగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మశన్న, బీసీ పొలిటికల్ జెఏసి మండల అధ్యక్షుడు గువ్వల హనుమంతు, ప్రధాన కార్యదర్శి జానకిరామ్, పరశురాం, జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట పట్టణ అధ్యక్షుడు అంజన్న యాదవ్, శ్రీరంగపురం అధ్యక్షుడు నాగరాజు, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మామిళ్ళపల్లి మృత్యుంజయ హోమంలో అచ్చంపేట ఎమ్మెల్యే

**ఉప్పునుంతల మార్చి 24 ప్రభాతవార్త :** అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీ కృష్ణ ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మి నరసిం హస్వామి ఆలయంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేముల నర్సింహారావు ఆధ్వర్యంలో ఈ హోమం వేద పండితులచే మంత్రోచ్చరణల మధ్య భక్తిశ్రద్ధలతో జరిగింది.ఈసందర్భంగా వేముల నర్సింహారావు మాట్లాడుతూ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ త్వరగా కోలుకుని ప్రజాసేవలో తిరిగి పాల్గొనాలని ప్రార్థిస్తూ ఈ హోమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఆలయ అధికారులు, భక్తులు, ప్రజాప్రతినిధులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం లో మహిళ భక్తుల చేత విష్ణు పారాయణం చేసి ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావుతోపాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మినరసింహస్వామి పాలక మండలి సభ్యులు చలమల గణేష్‌గౌడ్, చెవ్వ కృష్ణయ్య, ఎలుక స్వరూపసుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త యశోద ఫంక్షన్ హాల్ ప్రొ॥ డా. కొత్త చిన్న జంగి రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మొకురాల మోహన్ గౌడ్, కంసానిపల్లి మాజీ సర్పంచ్, సీనియర్ న్యాయవాది కర్నె లక్ష్మినారాయణ, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కాల్వ పుష్ప గోవర్ధన్ రెడ్డి, ఉప్పరి పల్లి మాజీ సర్పంచ్ అనంత ఇంద్రసేనా రెడ్డి, రతన్ సింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణ, ఉమామహేశ్వర దేవస్థానం డైరెక్టర్లు కట్ట శేఖర్ రెడ్డి, సిరసన గండ్ల సురేందర్ రావు, లక్ష్మయ్య, స్థానిక నాయకులు ఎర్రయ్య, నరేందర్ రావు, జగన్ , సురేందర్ రావు, యువజన కాంగ్రెస్ నాయకులు పానం సైదులు, సుదర్శన్, వెంకటేష్, భాస్కర్, శంకర్ ఆలయ సిబ్బంది నాగరాజు, విష్ణు పారాయణం సభ్యులు జయ చంద్రా రెడ్డి,బలుస కుమార స్వామి, వేముల నివేదిత, కాల్వ పుష్ప, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



మామిళ్ళపల్లి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మృత్యుంజయ హోమం

## రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోండి

**పెబ్బేరు, మార్చి 24 ప్రభాతవార్త :** వనపర్తి నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగ ఉపాధి అవకాశాలు సాధించాలని అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రాష్ట్రంలో 5 లక్షల మంది యువతకు స్వయం ఉపాధి అవకాశం కల్పించబోతున్న సందర్భంగా ధన్యవాదాలు తీర్మానం తెలుపుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కి, ఎమ్మెల్యే మేఘారెడ్డి కి వనపర్తి నియోజకవర్గ యువత ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అర్హులైన నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకంను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మంచి ఉద్యోగం పొంది సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తామన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 5 లక్షల మందికి రూ.6 వేల కోట్ల రాయితీ రుణాలు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ మంజూరు చేస్తుందని, ఒక్కో లబ్దిదారుడికి రూ.4 లక్షల వరకు రుణంను మంజూరు చేస్తామని అన్నారు. 60 నుంచి 80 శాతం వరకు రాయితీతో, ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని, ఏప్రిల్ 6వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన జరుగుతుందనీ, జూన్ 2వ తేదీన రాయితీ రుణాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సూగూర్ శివ, వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీ శివకుమార్, వనపర్తి అసెంబ్లీ అధ్యక్షుడు సాయిరెడ్డి, పెబ్బేరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్, టౌన్ ప్రెసిడెంట్ సాయి ,యూత్ కాంగ్రెస్ నాయకులు నరేష్ నాయుడు, లక్ష్మణ్ యాదవ్, శంకర్, పాల్గొనడం జరిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ నాయకులు

## విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన కల్పించిన ఎస్సై

**కృష్ణ, మార్చి 24 ప్రభాతవార్త :** కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కున్సి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పాఠ్యాంశంలో భాగంగా సోమవారం ఉదయం కృష్ణ పోలీస్ స్టేషన్‌కు రావడం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ ఎస్సై పోలీస్ స్టేషన్లో పోలీసులు నిర్వహించే విధుల పైన అవగాహన కల్పించారు. పోలీసులు నిర్వర్తించే విధులపైన, అత్యవసర సమయంలో డయల్ 100 కాల్స్‌పై, పోలీస్ స్టేషన్లో వైర్లెస్ కమ్యూనికేషన్ ద్వారా సమాచారం చేరవేసే విధానం, పోలీస్ స్టేషన్లో (5ఎస్ విధానం) ఆఫీస్ ఫైల్స్ క్రమబద్ధతిగా ఉంచే విధానం, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ ఏ విధంగా నమోదు చేస్తారని, ఎలాంటి కేసులు ఎక్కువగా వస్తాయి అని, పోలీస్ పెట్రోలింగ్ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు తీసుకుంటున్న చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోతున్నందున సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయని విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరానికి గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930 లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యార్థులు మీ ఇంటి పక్కల మీ బంధువులు స్నేహితులు సైబర్ క్రైమ్‌కు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాలు, అపరిచిత వ్యక్తుల నుండి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని, సెల్ఫోన్ అధిక వినియోగం వల్ల ఏర్పడే అనార్థాలు, బాల కార్మిక వ్యవస్థ, పోలీస్ చట్టాల పైన విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. విద్యార్థులు చిన్నతనం నుండి చదువుపై శ్రద్ధ పెట్టి బాగా చదువుకోవాలని, ఉన్నత చదువులు చదివడం వల్ల మంచి ఉద్యోగాలు వస్తాయని, తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్ గంజాయి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## ప్రచారాలకు తెరలేపిన ప్రైవేటు పాఠశాలలు

మొదటి పేజీ తరువాయి భాగం..

కార్పొరేట్ పాఠశాలలుగా చెప్పుకొని విద్యార్థుల చేరికలకు ప్రచారానికి తెరలేపాయి. గత సంవత్సరం ఇదే విధంగా కొత్తకోట మండలంలో పాఠశాలల అడ్మిషన్ల కోసం ప్రచారాలు చేసి తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేశారు. తీరా పాఠశాలలు ప్రారంభం అయ్యేసరికి పాఠశాల భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో అడ్మిషన్ పొందిన వారిని వేరే పాఠశాలకు బదిలీ చేస్తామనడంతో తల్లిదండ్రులు ఆ పాఠశాల తీరుపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేవరకు చేరింది. వనపర్తి జిల్లాలో నేటికీ అదే విధముగా కొన్ని ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్ల కొరకు ప్రచారాలు చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలలకు మధ్యాహ్నం వరకే తరగతులు నడుస్తున్నాయి. విద్యార్థులను మధ్యాహ్నము వరకే పంపించి పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లకు టార్గెట్లు విధిస్తూ వారిని మనోవేదనకు గురి చేస్తున్నారు. చెప్పిన టార్గెట్ల ప్రకారం అడ్మిషన్లు చేయించిన వారికే జీతాలు ఇస్తామని లేకుంటే విధులనుండి తొలగిస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రైవేట్ టీచర్లు విద్యార్థులకు సరైన పద్ధతులలో బోధన చేయలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకునేందుకు కొత్త కొత్త పద్ధతులను ఉపయోగిస్తూ తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తున్నారు. తీరా పాఠశాలల్లో చేర్చిన తర్వాత కనీస విద్యా బోధనలు కరువయ్యాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలల్లో నూతన పద్ధతులలో విద్యాబోధన జరుగుతుందని అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన చేయిస్తామని హామీలు ఇస్తూ చేరికలు పూర్తయిన తర్వాత చేతులు దులుపుకుంటున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటి నుండే ఆర్భాటాలకు తెరలేపిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లేనియెడల అమాయక ప్రజలను మోసం చేస్తూ విద్యార్థులకు కనీస విద్యా బోధన లేకుండా చేస్తారని అభిప్రాయపడుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రచారాలకు తెరలేపిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## గ్రామాధికారులకు మౌలిక వసతులపై సమీక్ష సమావేశం

**నవాబుపేట,మార్చి 24 ప్రభాతవార్త :** మండల సమావేశ మందిరంలో గ్రామాల్లోని ఎన్ఆర్ఈజీఎస్, గ్రామ అభివృద్ధి అధికారులకు మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంపీడీవో జయరాం నాయక్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ గ్రామాల్లోని మౌలిక వసతులు, తాగునీటి సమస్యలపై సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జయరాం నాయక్ మాట్లాడుతూ నర్సరీ, పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా, నిర్వహించాలన్నారు. కార్యదర్శులు ఎప్పటికప్పుడు రికార్డులను అప్డేట్ చేయాలని,టాక్స్ కలెక్షన్స్,తదితర అంశాలపై సమీక్ష చేసి సలహాలు సూచనలు చేశారు.గ్రామలలో నిర్వహిస్తున్న పనులు వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ బద్రు నాయక్, సూపరింటెండెంట్ గోవింద్ రెడ్డి, ఏపీవో జ్యోతి, ఈసీ రెడ్యా నాయక్, టి ఏలు జైపాల్ రెడ్డి, విక్రమ్, శివ, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టిఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

## 'పది' పరీక్షలకు 44మంది గైర్హాజరు

**మహబూబ్‌నగర్‌బ్యూరో,మార్చి 24,ప్రభాతవార్త :** జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మొత్తం 235 పరీక్షా కేంద్రాల్లో 45608మంది విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేశారు.మహబూబ్‌నగర్‌జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలకు సోమవారం మొత్తం12820 మంది విద్యార్థులు నమోదు కాగా, వీరిలో 12776మంది హాజరై,99.66 హాజరుశాతం నమోదుకాగా, 44మంది గైర్హాజరయ్యారు. అడిషనలఖ కలెక్టర్, ఆర్‌జేడీ, జిల్లా అబ్జర్వర్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఈవోతో సహా మొత్తం 26 మంది అధికారులు వివిధ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

## డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పేరెంట్స్ టీచర్స్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. సుకన్య

**జడ్చర్ల, మార్చి 24 ప్రభాతవార్త :** డా. బూర్గుల రామకృష్ణారావు కళాశాలలో పేరెంట్స్ టిచర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.సుకన్య మాట్లాడుతూ విద్యార్థుల పురోగతికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని, వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలని కోరారు. విద్యార్థులు కళాశాలకు క్రమం తప్పకుండా హాజరై మంచిగా చదువుకోవాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కళాశాలకు వెళుతున్నారా ,లేదా తెలుసుకోవాల్సిన బాధ్యత మీపైన ఉందని సూచించారు. అలాగే పేరెంట్స్ టిచర్ సమావేశంలో కన్వీనర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు,తలిదండ్రులతో, ఉపాధ్యయులతో సత్సంబంధాలను పెంపొందించుకుని, మీ ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని సూచించారు.

## అక్రమ మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

**పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామస్తుల ఆరోపణ**

**అలంపూర్, మార్చి 24 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలో బుడమర్సు గ్రామ శివారులో ఉన్న గొల్లగట్టు మట్టిని ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ మేరకు గ్రామస్తులు సోమవారం వడ్డేపల్లి తహశీల్దార్ కార్యాలయంలోని తహసిల్దార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అయితే గత కొద్ది రోజులుగా కొంతమంది దళారులు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని అడ్డుకట్ట వేయాలని వారు కోరారు.

## జాతీయ స్థాయి క్రీడాకారిణికి ఘన సన్మానం



క్రీడాకారిణిని సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్,మార్చి24 ప్రభాతవార్త:**ఇటీవల రంగారెడ్డి జిల్లా కోయిదలో జరిగిన రాష్ట్ర స్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీల్లో అసమాన ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు జాతీయ స్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి అనూషను సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం అనూష మహబూబ్‌నగర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం సెకండ్ ఇయర్ చదువుతున్నది. ఈ నేపథ్యంలో సోమవారం కళాశాల ప్రిన్సిపల్ జయప్రద, ఫిజికల్ డైరెక్టర్ రజనీలు అనూషతో పాటు కోచ్, విశ్రాంత పీఈటి బి.గోపాలంను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో జరిగే జాతీయస్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లాస్ టీచర్ స్వప్న, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళలకు తాపీ మేస్త్రీ శిక్షణ

- ఇందిరమ్మ గృహ నిర్మాణంలో తొలిసారి వినియోగం
- శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ విజయేంద్ర బోయి



శిక్షణ పొందుతున్న మహిళలతో కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 24, ప్రభాతవార్త:** రాష్ట్రం లోనే మొదటి సారిగా వినూత్నంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేయుటకు మహబూబ్ నగర్ జిల్లాలో డి.అర్.డి. ఓ ద్వారా గుర్తించిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులైన 41 మంది మహిళలకు తాపీ మేస్త్రీలో మహబూబ్‌నగర్ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ద్వారా (నాక్) హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ మండలం బండమీది పల్లి నిర్మితి కేంద్రంలో నిర్వహిస్తున్న 6 రోజుల శిక్షణా కార్యక్రమంను జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలో నాక్ ద్వారా 5 లక్షల బడ్జెట్‌లో నాణ్యతగా ఎలా నిర్మించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు,కొత్త టెక్నాలజీతో ఎలా నిర్మాణం చేయాలి వివరిం చారు, పేద వారికి ఇల్లు నిర్మించు కోవాలన్న తమ చిరకాల కోరిక ఈ విధంగా నెరవేరుతుంది ఆమె చెప్పారు. వారికి సేఫ్టీ మెటిరియల్, హెల్మెట్ టీ షర్ట్ బ్యాగ్, బుక్,పెన్ అందించారు.శిక్షణ అనంతరం సర్టిఫికెట్స్ అందజేయడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణ పి డి.వైద్యం భాస్కర్ మాట్లాడుతూ నియోజకవర్గానికి 3500 ఇండ్లు, మండలం లో సుమారు 700 ఇండ్లు కట్టాల్సి వుంటుందని మేస్త్రీలు అవసరం ఉందని అందుకే శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా శిక్షణ తీసెకోవాలనుకుంటే నాక్ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిధుల నుంచి సీసీకుంటమండలం దమగ్నాపూర్ గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలు డి రాణికి ప్రయోగాత్మకంగా ఇటుకల మిషన్‌కు రూ.లక్ష అందజేశారు.

# విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు

- నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, మార్చి24 ప్రభాతవార్త :** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ హెచ్చరించారు. వారం రోజులలో పనితీరు మెరుగుపర్చుకుని,లక్ష్య సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆమె ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రం సమీపంలోని సింగారం మలుపు దారివద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో జిల్లాలోని ఉట్కూర్, నారాయణపేట, దామరగిద్ద, మద్దూర్, కోస్గి మండలాల పరిధిలో ఉపాధి హామీ పథకం పనులు, వనమహోత్సవం, స్వచ్ఛభారత్ మిషన్ కు సంబంధించి ఉపాధి సృష్టించిన నివేదిక, కార్మిక సమీకరణ, గ్రామాల వారీగా లేబర్ నివేదిక, సగటు వేతన రేటు, గ్రామాల వారీగా సగటు వేతన రేటు,వన మహోత్సవం,నర్సరీలు అంకురోత్పత్తి, 100 రోజులు పూర్తిచేసుకున్న కుటుంబాలు, సకాలంలో చెల్లింపు,ఆధార్ ఎన్‌పీసీఐ, తిరస్కరించబడిన లావాదేవీల పునరుత్పత్తి, జిల్లాలో మెటీరియల్ చెల్లింపు, ఎస్‌బిఎం కార్యకలాపాలపై ఎంపీడీవోలు ఎంపీవోలు ఏపీవోలు, ఈసీలు, టిఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల విషయంలో అధికారులు, సిబ్బంది చాలా అలసత్వం వహిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని చెప్పారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, డిఆర్డిఓ మొగులప్ప పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి : నారాయణపేట జిల్లా కలెక్టర్

నారాయణపేట టౌన్, మార్చి 24 ప్రభాతవార్త : క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ లోని వీసీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ నారాయణ పేటను వ్యాధి రహిత జిల్లాగా మార్చడానికి మనమంతా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 14,707 పరీక్షలు నిర్వహించగా 903 కేసులు నమోదు కాగా వాటిలో 185 టార్గెట్ ఉన్నాయని అందులో 183 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. టీబీ వ్యాధిని అంతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ సౌభాగ్య లక్ష్మి, మెడికల్ ఆఫీసర్ డా.

# కేఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి కేంద్రం ప్రారంభం




అంబలి కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

**చిన్నంబావి, మార్చి 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వెల్టూరు గ్రామానికి చెందిన కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త కళ్యాణ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి, చలివేంద్ర కేంద్రాన్ని పర్యాటక శాఖమంత్రి జూపల్లి తనయుడు జూపల్లి అరుణ్ చేతుల మీదుగా చిన్నంబాయి మండల కేంద్రంలో అంబలి, చలివేంద్రం కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. సోమవారం ట్రస్ట్ చైర్మన్ కళ్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా వందల మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించుకున్నరు.జూపల్లి అరుణ్ కళ్యాణ్ కుమార్‌తో కలిసి చిన్నంబావి చౌరస్తాలో ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాల వేసి నమస్కరించడం జరిగింది. అనంతరం రిబ్బన్ కటింగ్ చేసి అంబలి కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణ్ కుమార్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసి ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని వాటితో పాటు మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పండ్లు, అంబలి వితరణ చేసి జూన్ తొలకరి జల్లులు వచ్చే వరకు ఈఅంబలి,నీళ్ల కేంద్రం ఉంటుందని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 108లో ప్రసవం.. తల్లి బిడ్డ క్షేమం



**లింగాల, మార్చి 24 ప్రభాతవార్త: :** పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళ 108 లో ప్రసవించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్ళితే మండల కేంద్రానికి చెందిన గువ్వని సంధ్యారాణికి పురిటి నొప్పులు రావడంతో లింగాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు కడుపులో బిడ్డ బరువు తక్కువగా ఉందని, ఇక్కడి నుంచి నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్ళాలని సూచించారు. 108కు అంబులెన్స్ సమాచారంతో అక్కడకి చేరుకున్న సిబ్బంది అక్కడి నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా,తెల్కపల్లి సమీపంలోని చేరుకోగానే పురిటి నొప్పులు అధికంగా రావడంతో అంబులెన్స్‌లోనే వైద్యాధికారి మనీష్ సూచన మేరకు ఈఎంటి శివ శంకర్, పైలెట్ కిషోర్ అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. సంధ్యారాణికి మొదటి సంతానంగా ఆడ బిడ్డ జన్మించింది. ప్రస్తుతం తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు. అనంతరం తల్లి బిడ్డను నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. సరైన సమయంలో వచ్చి ఆదుకున్న 108 సిబ్బంది ఈఎంటి శివశంకర్ పైలట్ కిషోర్ ని కుటుంబసభ్యులు అభినందించారు.

# మీరు ఎందులోనూ తక్కువ కాదు

- ఉన్నత లక్ష్యాలతో ఆకాశానికి నిచ్చెన వేద్దాం
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 24, ప్రభాతవార్త:** ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించడానికి ఆకాశానికి నిచ్చెన వేద్దాం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు మహ బూబ్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలను దేశ్ పాండే ఫౌండేషన్ బృందంతో కలిసి ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం గారు చెప్పినట్లుగా మన ఆలోచనలు ఉండాలని ఆయన చెప్పారు. మహబూబ్‌నగర్ పట్టణంలో ఉన్న రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బెస్ట్ ఆఫ్ ది బెస్ట్‌గా తెలంగాణ రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రథమ స్థానంలో నిలపాలన్నదే తన ఆశయం అని ఆయన చెప్పారు. చివరి సంవత్సరం డిగ్రీ చదువుతున్న 500 విద్యార్థులకు మందికి దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రీజనింగ్, ఇంగ్లీష్ మరియు కంప్యూటర్ లలో శిక్షణ ఇస్తారని, వారు డిగ్రీ పూర్తి చేసిన వెంటనే ఏదేని సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు దేశ్ పాండే ఫౌండేషన్ వారి శిక్షణ మీకు ఉపయోగపడుతుంది అని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ విద్యార్థులు ఎందులోనూ తక్కువ కాదని, ఎందులోను తగ్గరని, మీకు కావల్సిన అన్ని వసతులు సౌకర్యాలు నేను కల్పిస్తానని హామీ ఇచ్చారు. మహబూబ్ నగర్‌లో జరిగే మొదటి బ్యాచ్ ను పైలెట్ బ్యాచ్ గా ఎంచుకోవాలని దేశ్ పాండే ఫౌండేషన్ ప్రతినిధులను తాను కోరానని దానికి వారు ఒప్పుకున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఒక రోజు జాతీయ సదస్సు గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, దేశ్ పాండే ఫౌండేషన్ బృందం ప్రవీణ్ ముత్యాల, శేఖర్, విశ్రాంత ప్రిన్సిపాల్ మురళీమోహన్,ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.రాజేంద్రప్రసాద్, నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, గుండా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

**నైపుణ్య శిక్షణ కోర్సుల మెటీరియల్స్ పంపిణీ:** మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తన సొంత నిధులతో నియోజకవర్గంలోని మహిళలకు గృహిణులకు మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు కార్యాలయం శిక్షణా కేంద్రంలో బ్యూటీషన్, కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్ లలో ఉచితంగా శిక్షణను అందిస్తున్నారు. ఈమేరకు సోమవారం బ్యూటీషన్ కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు సంబంధించిన మెటీరియల్స్‌ను ఎమ్మెల్యే అందజేశారు. నవరత్నాలు శిక్షణా కేంద్రంలో వివిధ కోర్సుల్లో 240మంది శిక్షణ పొందుతున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ మురళీమోహన్, శ్రీరామ జయరామ ఇంజనీరింగ్ కంపెనీ యజమాని బెక్కెరి రామిరెడ్డి, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, ఇంచార్జ్ నిజలింగప్ప పాల్గొన్నారు.

# జిల్లాలో కొనసాగుతున్న పది పరీక్షలు

- పరీక్షలు నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్ పాత్రే అత్యంత కీలకం
- నాగర్‌కర్నూల్ డీఈఓ రమేష్ కుమార్




పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

**కల్వకుర్తి, మార్చి24 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని, సోమవారం నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు 10,562 మంది విద్యార్థులకు గాను, 10,537 మంది విద్యార్థులు హాజరుకాగా, 25 మంది విద్యార్థులు నేటి ఆంగ్ల పరీక్షకు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్ తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, తాడూరు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షల నిర్వహణను డీఈఓ రమేష్ కుమార్ సోమవారం సందర్శించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల సమక్షంలో ప్రశ్నపత్రాల ఓపెన్ చేసే ప్రక్రియను డీఈఓ పరిశీలించారు. ఎలాంటి సమస్యలు తప్పకుండా పరీక్షలను అత్యంత సజావుగా కొనసాగించాలని చీఫ్ సూపరింటెండెంట్‌లను ఆదే శించారు. జిల్లా వ్యాప్తంగా 60 పరీక్ష కేంద్రాల్లో పది పరీక్షలు అత్యంత ప్రశాంత వాతావరణంలోకొనసాగుతున్నాయని తెలిపారు.అంతకు ముందు ఉదయం 8 గంటలకు డీఈఓ కల్వకుర్తి పోలీస్ స్టేషన్ నుంచి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో పరిధిలోని 60 పరీక్షా కేంద్రాల సీఎస్, డీఓలతో సెట్ కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. 10వ తరగతి పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్ పాత్రే కీలకమని, పదవ తరగతి పరీక్షల విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ నుండి కల్వకుర్తి పట్టణంలోని 8 పరీక్ష కేంద్రాలకు, నేటి ఆంగ్ల పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాల తరలింపు ప్రక్రియను డీఈఓ పరిశీలించారు. సరైన కోడ్ నెంబర్‌ను సరిచేసుకొని ప్రశ్నపత్రాల తరలింపు ప్రక్రియను కొనసాగించాలని డీఈఓ సూచించారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించాలని సూచించారు. కేంద్రాల్లోకి ఏ ఒక్కరు కూడా సెల్ ఫోన్ తీసుకురావడానికి వీళ్లు లేదని డీఈఓ స్పష్టం చేశారు. విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, తదితర సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నేటి ఆంగ్ల పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 34 పరీక్ష కేంద్రాలను 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఈ సందర్భంగా తెలిపారు. పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ రావు, మండల విద్యాధికారులు భాస్కర్ రెడ్డి, శంకర్ నాయక్, చంద్రుడు నాయక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలకు నష్టపోయిన రైతులు

- వడగళ్లవానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



కరివెనలో వడగళ్లవానకు దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఈఓ మురళిధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి

**భూత్పూర్, మార్చి 24,ప్రభాతవార్త :** ఆదివారం భూత్పూర్ మండలంలో కురిసిన అకాల వర్షాలు,వడగళ్ల వానకు మద్దిగట్ల,కరివెన,వెల్కిచర్ల గ్రామాలలో వరి,మొక్కజొన్న పంటలకు జరిగిన నష్టపరిహారాన్ని అంచనా వేసేందుకు భూత్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం మండల అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో వడగళ్ల వానకు నష్టపోయిన వరి,మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కరివెన మద్దిగట్ల గ్రామాల్లో అధికంగా 1543ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.ఈ రెండు గ్రామాల్లో మొత్తం 1430 ఎకరాలలో వడగళ్ల వానకు వరిపంట నష్టపోయినట్లు నిర్ధారించారు. మొక్కజొన్న ఈ మూడు గ్రామాల్లో 65ఎకాలకు పైగా మొక్కజొన్న పంట,ఉల్లి రెండెకరాలకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి నాయకులు దెంది లక్ష్మికాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాంరెడ్డి,వెంకటేష్ అధికారులు తహశిల్దార్ జయలక్ష్మి,వ్యవసాయ అధికారి మురళీధర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.అకాల వర్షాలు,వడగళ్లవానకు పంటలు నష్టపోయిన 904మంది రైతులకు తగిన నష్టపరిహారం అందిందేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జీఎంఆర్ హామి ఇచ్చారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



మద్దిగట్లలో పంటలకు నష్టపరిహార అంచనా వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

# ప్రజావాణికి 27 ఫిర్యాదులు

- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అమరేందర్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 24 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అమరేందర్ అధికారులకు సూచించారు. నాగర్‌కర్నూలు జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 27 ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీసీరోడ్ల నిర్మాణాలకు శ్రీకారం



**భూత్పూర్,మార్చి 24, ప్రభాత వార్త:** భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీ ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశాలతో సీసీ రోడ్ల నిర్మా ణాలకు సోమవారం శ్రీకారం చుట్టినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డితో పాటు నాయకులు దెంది లక్ష్మికాంత్‌రెడ్డి,వడ్డె శ్రీనివాసులు,రాంరెడ్డి తదితరులు పాల్గొన్నట్లు కేసిరెడ్డి తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**రాజాపూర్, మార్చి24 ప్రభాతవార్త:** రాజాపూర్ మండలం సింగమ్మగూడ గ్రామపంచాయతీ అంజమ్మ తండాలో కొనసాగుతున్న శ్రీ వెంకటేశ్వరస్వామి చతుర్థిబ్రహ్మోత్సవాలు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో హాజరై స్వామివారినిదర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పల్లకి సేవ,ముగ్గుల పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి.అంతకుముందు భోగ్ బండార్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతోనిర్వహించారు.ఈ కార్యక్రమంలో సింగమ్మగూడ గ్రామపంచాయతీతోపాటు రాజాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకుచెందిన ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు



ఎస్ఐ కృష్ణదేవ

**ఊర్కొండ, మార్చి 24 ప్రభాత వార్త:** ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నడుస్తున్నందున చాలామంది యువత ఈజీగా డబ్బులు సంపాదించడం కోసం క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడటం జరగుతుందని, అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని ఊర్కొండ ఎస్ఐ కృష్ణదేవ ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ వల్ల యువత ఆర్థికంగా దెబ్బతిని సూసైడ్ చేసుకొని ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని, కావున యువత అలాంటి వాటికి దూరంగా ఉండాలని కోరారు. ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్ పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, అంతేకాక బెట్టింగ్ నిర్వహించే వారిపై కూడా పోలీస్ నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. క్రికెట్ బెట్టింగ్, ప్లేయింగ్ కార్డ్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

# సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

**వెల్దండ, మార్చి 24 ప్రభాతవార్త:** వ్యవసాయ యాంత్రికంలో భాగంగా మహిళా రైతులకు వ్యవసాయ యాంత్రికరణపై ఉపమిషన్ ఎస్ఎంఏఎం పథకం ద్వారా 50శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లకు బడ్జెట్ కేటాయించడం జరిగిందని మండల వ్యవసాయఅధికారిని శోభారాణి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని మహిళా వ్యవసాయ రైతులకు2లక్షల 32వేలతో16 యూనిట్లకు బ్యాటరీ స్ప్రెయర్లు 05, తైవాన్ స్ప్రెయర్లు 5, రోటో మీటర్లు 2, సీడ్ కం ఫర్టిలైజర్ డిల్లర్ 1, కల్టివేటర్ ఎంబి ప్లావ్‌లు 3 ఉన్నాయని ఈ రాయితీ పొందేందుకు మహిళల పేరు మీద భూమి నమోదు ఉండాలి, భూమి పాసుబుక్కు ఆధార్ కార్డు ట్రాక్టర్ ఆర్‌సి ట్రాక్టర్‌కి సంబంధించిన పనిముట్లకు మాత్రమే దరఖాస్తులను ఏఈఓలవద్ద, మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో వద్ద ఈనెల 26వ తేదీ లోపునమోదు చేసుకోవాలని ఈ అవకాశాన్ని మహిళా రైతులు సద్వినియం చేసుకోవాలని అన్నారు.

## చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

**పెబ్బేరు, మార్చి 24 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణ కేంద్రంలో తేదీ 14.03.2024 నాడు అర్ధరాత్రి ఎవరు గుర్తు తెలియని వ్యక్తులు భవాని వైన్ షాప్ యొక్క రేకు కోసి షాపులోకి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న 1500, షాప్ నందు మద్యం దొంగిలించరని షాపు యజమాని నరసింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులు దొంగ హైదరాబాద్ నగరానికి చెందిన శివ ను పట్టుకొని సోమవారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తము కోర్టుకు పంపారు.

# కలెక్టర్ ఆదేశాలతో అక్రమ నిర్మాణాలు కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు



**కొల్లాపూర్, మార్చి 24 ప్రభాతవార్త :** చిన్నంబావి మండల కేంద్రంలో పెద్దదగడ గ్రామ శివారులో 195 సర్వేనెంబర్‌లో ప్రభుత్వ భూమి అక్రమకబ్జాకు గురైందని, అట్టి భూమిలో ఆక్రమంగా భవనాల నిర్మాణాలు చేశారని వాటిని కూల్చివేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ ఆదేశాల మేరకు చిన్నంబావి మండల రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు, పోలీసుల ఆధ్వర్యం లో సోమవారం నిర్మాణాలను జేసిబితో కూల్చివేశారు. ఈ అంశంపై బాధితులైన చిన్నారెడ్డి, మేకల కృష్ణయ్యలు అట్టి భూమిలో తాము 2023 లోనే నివాసాల కొరకు కట్టడాలను నిర్మించుకున్నామని రాజకీయ నాయకులు తమపై రాజకీయకక్ష కట్టి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే, చిన్నంబావి మండలం తహసిల్దార్ ఇక్బాల్, చిన్నంబావి మండల పంచాయతీ కార్యదర్శి, అధికారులు, చిన్నంబావి మండల పోలీసులు ఆధ్వర్యంలో తమ కట్టడాలను అక్రమంగా జెసిబిలతో కూల్చివేశారని బాధితులు వాపోయారు.

# పాఠశాలలో చేరిన నలుగురు బాల కార్మికులు

**లింగాల, మార్చి24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని యుపిఎస్ అప్పాయిపల్లి పాఠశాలలో నలుగురు బాలకార్మికులను చేర్పించినట్లు కోనేరు సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గ్రామానికి చెందిన అతినారపు శాంతయ్య, మహేశ్వరి దంపతులకు 5 మంది ఆడ పిల్లల సంతానం ఉన్నారు. కూలీ పనులు చేసేందుకు హైదరాబాదు వలస వెళ్ళి ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. వారిని గుర్తించిన కోనేరు సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ ఎం. శ్రీనివాస్ యాదవ్ చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందజేశారు.స్పందించిన చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ ప్రమీల గ్రామానికి చేరుకుని గ్రామ పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అంగన్వాడి టీచర్లు రామేశ్వరమ్మ, మాజీ ఉప్ప సర్పంచ్ పర్వతాలు,కృష్ణ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరవింద్, సమక్షంలో ఇంటికి వెళ్ళికౌన్సిలింగ్ ఇచ్చి పాఠశాలలో శివ రేణుక ,భవిత కవితలను పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.

## విద్యార్థికి నగదు అందజేత

**నారాయణపేట టౌన్, మార్చి 24 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం జలాల్ పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దివంగత రాంపురం సిద్రామ్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి ఓ విద్యార్థికి నగదు పురస్కారం అందించారు.రాంపురం కుటుంబంలోని పిల్లలు గత 20 సంవత్సరాల నుంచి వరుసగా పట్టణంలోని శ్రీహంసవాహిని పాఠశాలలో విద్యా బోధన చేశారు. ఈ క్రమంలో తండ్రి జ్ఞాపకార్థం ఏటా ఆ పాఠశాలలో టాపర్‌గా నిలిచిన విద్యా ర్థికి పదవ తరగతికి సంబంధించిన పూర్తి ఫీజు చెల్లిస్తామని ప్రకటి ంచారు. ఈ క్రమంలో 2024,25 విద్యా సంవత్సరంలో హోమ్ ఎగ్జామ్స్, రివిజన్ టెస్టులు, గ్రాండ్ టెస్ట్, ప్రీ ఫైనల్‌తో పాటు పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన దామరగిద్ద మండలం వత్తుగుండ్ల గ్రామానికి చెందిన నితిన్ కుమార్‌కు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి, డిసిసి మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి చేతుల మీదుగా నగదుపురస్కారం అందించారు. అనంతరం ఎమ్మెల్యే, డిసిసి మాజీ అధ్యక్షులు ,మార్కె ట్ కమిటీ చైర్మన్‌లను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజేష్ కుమార్, పేరెంట్ నర్సింలు,నిర్వహకులు రామపురం వీరేశ్వర్‌రెడ్డి, సంపత్ కుమార్, వత్తుగుండ్ల మాజీ సర్పంచ్ హన్మంతు పాల్గొన్నారు.